కథ

# చరణం జారిపోయాక...

రవీందర్ బెజ్జారపు

**రమ్య చేతిలోని వెడ్డింగ్ కార్డులన్నీ అత్తరు వాసనతో ఘుమఘుమలాడుతున్నాయి. కొత్త పెళ్ళికూతుళ్ళలా కళకళలాడుతున్నాయి. వాటిని వేళ్ళతో అటూఇటూ కదుపుతూ చాలాసేపు ఉండిపోయింది. ఆమె తన పెళ్ళికి సంబంధించిన ప్రతి విషయంలోను శ్రద్ధ తీసుకుంది. వెడ్డింగ్‌కార్డుల సెలక్షన్ కూడా 'రిచ్'గా ఉండేలా చూసుకుంది. మల్టీకలర్ స్క్రీన్ ప్రింటింగ్ చేయించుకొంది. ఆ మారుమూల పల్లెటూరికి దగ్గరగా ఉన్న మండల కేంద్రంలోని ప్రింటింగ్ ప్రెస్‌లో అచ్చు వేయిస్తానని ఆమె తండ్రి రాజిరెడ్డి నచ్చచెప్పబోతే ఒక రోజంతా అలిగి కూర్చుంది. ఆ పిల్ల ఆరాటాన్ని చూసి మేనత్త కమలమ్మ దీర్ఘాలు తీసింది.**

"మా కాలంలోనైతే... ..."

వెంటనే అందుకుంది రమ్య "మా ముత్తవ్వ కాలంలోనైతే ఇద్దరు పిల్లలు పుట్టేదాకా తాత మొహం గట్టిగా చూడలేకపోయిందావిడ. మరి నువ్వేమో మా ముందరే మామ మీద జోకులేస్తావు. అంతా కాలంమహిమా అత్తా... కాలం మహిమా" అంటూ ముసలావిడ స్టైల్లో అనేసరికి అందరూ నవ్వేశారు.

పట్టుచీరల దగ్గర కూడా గొడవ చేసింది. హైదరాబాద్‌లో వెరైటీ కలర్స్ దొరుకుతాయని మేనత్త కమలమ్మను, తల్లి సుశీలమ్మను తీసుకుని బయలుదేరింది. మూడు పట్టుచీరలు ఎక్కువగా కొనిపించింది.

"ఇప్పుడే ఇంత ఖర్చెందుకే? ఎలాగూ పండగ పబ్బాలకి, పురుళ్ళకి పెడతాంగా!" అంది సుశీలమ్మ కూతురితో. దానికి రెడీమేడ్ సమాధానం రమ్య దగ్గిర ఉండనే ఉంది.

"అప్పటికి అన్నయ్యకు పెళ్ళవుతుంది. వదిన వస్తుంది. ఇక చీరసారెల దగ్గిర నాకెంత న్యాయం జరుగుతుందో తెలుసు" అంది. 'నా విషయంలో అచ్చు అలాగే జరిగింది. ఈ పిల్లకున్నపాటి తెలివి తనకెందుకు లేకపోయిందో' సుశీలమ్మను కొరకొర చూస్తూ మనసులో మదనపడింది కమలమ్మ.

షాపింగ్ పూర్తయ్యేసరికి సాయంత్రమవుతుంది. ఇంకా కొన్ని పనులు మిగిలిపోయాయి.


"మిగిలిన సామాను రేపు కొందాం. ఇప్పుడు మాత్రం తొందరగా రాగిణి వదిన దగ్గరకెళదాం. ప్లీజ్ అత్తా..." అంటూ బతిమిలాడింది.

కమలమ్మ కూతురు రాగిణి అదే నగరంలో ఉంటోంది.

రాగిణి రమ్యకంటే ఐదు సంవత్సరాలు పెద్దది. ఇద్దరు వదిన - మరదళ్ళలాగా కాకుండా స్నేహితుల్లా కలిసి ఉంటారు. ఆమెకు నాలుగు సంవత్సరాల కిందట పెళ్ళయింది. పెళ్ళయిన సంవత్సరానికే తల్లయింది. తండ్రి రంగు, పోలికలతో పసిపాప మెరిసిపోయేది. అందమైన ఆ పిల్లకు దిష్టి తగులుతుందేమోనని భయపడిన దేవుడు దిష్టిచుక్కగా మనోవైకల్యాన్ని ఇచ్చాడు.

కూతురు పుట్టిన ఆరునెలలకు కాలం చిన్నచూపు చూసింది. భర్త యాక్సిడెంట్‌లో చనిపోయాడు! రెండుపదుల వయసులోనే వైధవ్యాన్ని వెంటపెట్టుకుని పుట్టింటికి తిరిగి వచ్చింది. ఒక సంవత్సరం పాటు ఇల్లు శోకగీతంలా మారిపోయింది. పెదవులు విడివడితే ఏడుపుశబ్దం, కళ్ళు తెరుచుకుంటే కన్నీటి జలపాతం!

పశ్చాత్తాపపడిన కాలం, లేపనాల్ని పూయడం ప్రారంభించింది. అప్పటివరకు చలాకీగా తిరిగిన పిల్ల సమస్తం కోల్పోయిన విరాగిలా ఉండడం ఇంట్లోవాళ్ళను, బంధువులను బాధతో మెలితిప్పేది. ఆమెకు మళ్ళీ పెళ్ళి చెయ్యమని తల్లిదండ్రులను బంధువులు ఒత్తిడి పెట్టసాగారు. ఎవరైనా తెలిసిన వాళ్ళు ఇంట్లోకి రావడమే ఆలస్యం... కుశల ప్రశ్నలూ అవీ అయ్యాక రాగిణి ప్రస్తావన ముందుకు తెస్తారు. "ఏమంత వయసయిందనీ..." అంటూ మొదలుపెట్టి చెమరిన కళ్ళను ఒత్తుకుంటారు. సంబంధాలు చూడమని సలహా ఇచ్చి సంభాషణ ముగిస్తారు.



రాగిణికి మళ్ళీ పెళ్ళి చెయ్యాలన్నా కోరిక తల్లిదండ్రులకు ఉన్నా, లోకం ఏమనుకుంటుందోనని మొదట్లో సంకోచించారు. కాని అందరు అదే సలహా ఇవ్వడం వారికి మనో ధైర్యాన్నిచ్చింది. ముఖ్యంగా కమలమ్మ అన్నయ్య రాజిరెడ్డి, వదిన సుశీలమ్మల అండ కొండంత బలాన్ని ఇచ్చింది.

రాజిరెడ్డి తనకు తెలిసిన రెండు సంబంధాలు తీసుకువచ్చాడు. అవి కొద్దిగా తక్కువ ఆర్థికస్థాయి కలవాళ్ళవి. అయినా ఈ పరిస్థితిలో ఆర్థికస్థాయి చూడదలుచుకోలేదు. రెండు సంబంధాల్లో ఒక అబ్బాయి అవివాహితుడు. అమ్మాయి నచ్చిందతనికి. కట్నమూ ఎక్కువ ముట్టే అవకాశాలు కనిపించాయి. కాని రాగిణి కూతురు విషయమే అతన్ని పునరాలోచనలో పడవేసింది. మరొక అబ్బాయికి ఆపాటికే వివాహం అయింది. కాని డెలివరీలో మృతశిశువుకు జన్మనిచ్చి భార్య చనిపోయింది. రాగిణిని చూసి, ఆమె కూతురి గురించి విన్న తరువాత అనుకున్నాడు "ఈ తెల్లటి, పిచ్చిపిల్ల గనక లేకపోతేనా...." లేకపోవడం అసాధ్యమని తెలుసుగనక మొహం చాటేశాడు.

తమ కూతురి రెండో పెళ్ళికి వున్న అడ్డంకేమిటో రాగిణి తల్లిదండ్రులకు తెలిసి వచ్చింది. మనవరాలే గనక లేకపోతే కూతురి వివాహం అసాధ్యమయ్యేది కాదని తెలుసుకున్నా, ఆ పసిపిల్ల పట్ల ప్రేమ తగ్గలేదు. తమ దుస్థితికి ఎవరినీ బాధ్యుల్ని చేయదలచుకోలేదు. దేవుణ్ణి తప్ప! ఎందుకంటే కనపడని వాణ్ణి తిట్టడంలో సౌఖ్యం ఉంది. సౌకర్యం ఉంది.

రాగిణికి తన కూతురంటే ప్రాణం. నిష్కపటమైన ఆ పిల్ల కళ్ళు, చేతలు చూసి దేవుడి ప్రతిరూపం అనుకునేది. అందుకే కూతురిని 'దేవుడి తల్లి' అని పిలుచుకుంటుంది. కూతురి విషయంలో ఎవరినీ నమ్మదు, చివరికి కన్నతల్లిని కూడా! ఆ చిన్నపిల్ల పనులన్నీ స్వయంగా తనే చేయాలి. పసితనంలో తన 'దేవుడి తల్లి' చేష్టలు అందరికి మామూలుగానే కనిపిస్తాయి. కాని పెరుగుతున్న కొద్ది దాన్ని పిచ్చిదనో, మరేదనో ముద్రలు వేస్తారు. మనుష్యులు ఎప్పుడో ఒకప్పుడు తమ ఒరల్లోంచి చీకటిపార్శ్వపు కత్తుల్ని దూయకమానరు. ఖడ్గచాలనం చేయకమానరు.

రాగిణి తన తల్లిదండ్రుల్ని ఒప్పించి నగరం వచ్చింది. ఒక చిన్నపోర్షన్ అద్దెకు తీసుకుంది. కూతురిని బేబి కేర్‌సెంటర్‌లో ఉంచి తాను 'టీచర్ ఎడ్యుకేషన్ ఫర్ మెంటల్లీ హాండీక్యాప్డ్'లో చేరి డిప్లమో సంపాదించింది. ఒక ప్రైవేటు మానసిక వికలాంగుల పాఠశాలలో టీచర్‌గా చేరింది. అందులోనే తన కూతురిని చేర్పించింది. కాని ఇదంతా మూడుముక్కల్లో చెప్పినంత సులభంగా జరగలేదు. అదొక పోరాటం! నిరంతర పద్మవ్యూహ ఛేదనం! ఒంటరి ఆడవాళ్ళ పట్ల మగాళ్ళ దొంగసానుభూతులు, కపట స్నేహాలు అన్నీ అవగతమయ్యాయి. సింగిల్ వుమన్ సేఫ్టీగా బతకాలంటే పాదరసంలా జారి

పొగలగాలి. క్రూరమృగాల సమూహాల మధ్య కిక్కిరిసిన వేటగాళ్ళ ఉచ్చుల్ని తప్పించుకోవడంలో నిపుణత సంపాదించిన లేడిపిల్లలా తయారవ్వాలి.

ఆమె ఎదుర్కొన్న అవమానాలు, 'దేవుడి తల్లి'ని సాకడంలోగల ఇబ్బందులు అన్నింటిని రమ్యకు చెప్పుకొని ఊరట పొందేది. అంతులేని అసంతృప్తితో విలవిల్లాడేది. జీవితంలోని వెలితిని ఉద్యోగం, కూతురూ పూడుస్తాయని అనుకునేది. కాని ఏదో ఒక ఏకాంతసమయంలో మెత్తటిస్పర్శ కోసం, తన కష్టాల్ని భరించగల బలమైన చేతులమధ్య ఒదిగిపోయే క్షణం కోసం తహతహలాడేది. ఆమెకు తన జీవితంలో గొప్ప ఓదార్పు రమ్యమాత్రమే! ఏ మొహమాటాలు, దాపరికాలు లేకుండా మనసులోని భావాల్ని, ఆశల్ని రమ్యముందు వెళ్ళబోసుకునేది. ఒక్కోసారి ఏడ్చేది.

**చలికాలాన్ని తరిమికొడుతూ వేసవికాలం వచ్చేసింది. కొత్త దంపతులను ఎండా, చలి అంతగా బాధించవు. ఒకరి సాన్నిధ్యం మరొకరికి ఎయిర్ కండీషన్‌లాగా వుంటుంది. చలి ముసురుకునేవేళ వెచ్చదనపు కౌగిళ్ళు, వేడిసమయాల్లో ఒకరి ఒడిలో ఒకరు సేదతీరడాలు... దాంపత్యం పాతపడుతున్నప్పుడు కూలర్లు, హీటర్ల అవసరం గుర్తొస్తుంది.**

షాపింగ్ పూర్తిచేసుకుని రాగిణి ఉంటున్న ఇంటికి చేరుకునేసరికి చీకటిపడుతోంది. గేటువద్ద వారికి సత్యం స్వాగతం చెప్పాడు. సత్యం, రమ్యకు కాబోయే భర్త! అతణ్ణి ఆ సమయంలో అక్కడ చూసేసరికి సుశీలమ్మ ఆశ్చర్యపడింది. ఈ కలయిక కాకతాళీయం కాదనిపించింది. రమ్య మెల్లగా అంది.

"నేనే ఉత్తరం రాశాను. ఈరోజు షాపింగ్‌కు వస్తున్నామనీ... ఇక్కడ ఎదురు చూడమనీ..."

కమలమ్మ ముసిముసిగా నవ్వింది. అందరు లోపలికి వెళ్ళారు. అప్పటికే రాగిణి అందరికోసం భోజనాలు సిద్ధం చేస్తోంది. తన ఆత్మబంధువు రమ్యను ఆదరంగా ఆహ్వానించింది. సుశీలమ్మకు ఇదంతా కుట్రలా తోచింది. తన కూతురు సత్యంతో చనువుగా ఉండడం అయిష్టమేమీ కాదు. కాని తనకు చెప్పకుండా పథకం మొత్తం సిద్ధం చేసి, ప్రేక్షకపాత్రను మాత్రం అంటగట్టడం కోపం తెప్పించింది. అయితే సత్యాన్ని చూడగానే కూతురి కళ్ళలో మెరిసిన మెరుపు ఆమెను మామూలు మనిషిని చేసింది.

ఎమ్మే, బి.ఇడి పూర్తి చేసిన సత్యం కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు కాలేజీలో పనిచేస్తూ టీచర్ రిక్రూట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నాడు. త్వరలోనే ఉద్యోగం దొరుకుతుందని నమ్మకం. పెళ్ళి కుదిరిన క్షణం నుండి రమ్యను కలుసుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు. తన స్నేహితులంతా ఎంగేజ్‌మెంట్ అయిన రోజు నుండి వాళ్ళ 'వుడ్ బీ' లతో సినిమాలకు, షికార్లకు వెళ్ళడం లేదూ! ధైర్యం చేసి రమ్య వాళ్ళ వూరికి వెళ్ళాడొకసారి. అత్తామామలు బాగా ఆదరించారు. రమ్యకోసం కిటికీలవైపు, తలుపులవైపు చూడసాగాడు. వాళ్ళేదైనా ప్రశ్న అడిగినా అటువైపే చూస్తూ జవాబు చెప్పసాగాడు. అల్లుడికి మెల్లకన్నేమోనని సుశీలమ్మ, రాజిరెడ్డిలకు అనుమానం వచ్చింది. కూతురు వచ్చి అతనికి ఎదురుగా కూర్చున్న తరువాత నమ్మకం కలిగింది, అల్లుడి కళ్ళకు దోషం ఏమీ లేదనీ! రమ్యకోసం వస్తే వాళ్ళమ్మ కూడా బోనస్‌గా ఉండడం అతనికి కష్టంగా తోచింది. ఆమె వున్న పదినిమిషాలపాటు సుశీలమ్మ కూడా ఉంది. వాళ్ళిద్దరు నిష్క్రమించిన తరువాత బావమరిది వచ్చి పలకరించాడు. రంగం మీదికి ఈ పాత్రల రాకపోకల తీరు అతనికేమి నచ్చలేదు. ఏ సందేశం అందించకుండానే తిరిగి వచ్చేశాడు.

కాని మొన్న రమ్య రాసిన ఉత్తరం అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. అయితే అందులోని మెల్లకన్ను అంశం మాత్రం కలవరపరిచింది. ఈసారి అలాంటి తప్పు చేయదలుచుకోలేదు. అందుకే కమలమ్మకానీ, రాధమ్మ కానీ ఏవైనా ప్రశ్నలడిగితే సూటిగా వాళ్ళ కళ్ళలోకే గా...ఢం...గా చూస్తూ జవాబులు చెప్పాడు. అతని సూటి చూపులకు బెంబేలెత్తిపోయారు. మాటిమాటికి పైట సవరించుకోవడం ఇబ్బందనిపించి రమ్య ఒక్కత్తినే ముందర రూమ్‌లో వదిలేసి వంటింట్లోకి పారిపోయారిద్దరు!

***

పెళ్ళయిన నెలరోజులకు కరీంనగర్‌లో ఒక పోర్షన్ అద్దెకు తీసుకున్నారు. జంట పావురాల్లా ఆనందంగా ఉన్నారు. సత్యం పొద్దున ఎనిమిదిగంటలకు కాలేజీకి వెళతాడు. మధ్యాహ్నం రెండుగంటలకల్లా వస్తాడు. సాయంత్రం ఇద్దరు కలిసి స్నేహితుల ఇళ్ళకు, బంధువుల ఇళ్ళకు వెళతారు. వారానికి రెండు సినిమాలు, ప్రతి శనివారం గీతాభవన్‌లో భోజనం తప్పనిసరి.

అప్పుడే పిల్లలు వద్దనే విషయంలో ఇద్దరికి ఏకాభిప్రాయం వుంది. అభిప్రాయ భేదమల్లా "ఎలా?" అనే దానిపైనే! చాలా రాత్రులు అదే విషయమై చర్చ జరిగేది.

"టీ..." అంటాడు సత్యం. రాత్రి పదిగంటలవేళ టీ అవసరం ఏమిటో అర్థం కాదు రమ్యకు.

"కాపర్ టీ..." అంటూ సవరిస్తాడు.

"నో థాంక్స్! దాంతో కాంప్లికేషన్స్ సార్..." అంటుందామె.

"పిల్స్?" అంటాడు సత్యం.

"రోగిష్టిదానిలా రోజూ గోళీలు మింగడమే! నాకు వికారం బాబూ... సారీ!" అంటుంది రమ్య.

"మిగిలిందొక్కటే... అది నేను వాడాలి... కాని నాకిష్టముండదు" అసంతృప్తిగా ముఖం పెడతాడు సత్యం.

"ఇంకొక్కటి కూడా వుంది సార్. నో అనడాన్ని మించిన బర్త్ కంట్రోల్ సాధనం లేదు. తెలుసుగా" పకపకనవ్వుతుంది రమ్య.

ఇలావాళ్ళు జస్వంత్‌సింగ్, టాల్బోట్‌ల లాగా సుదీర్ఘ చర్చలు జరుపుతూ రోజులు గడుపుతుండగా ఆ నెల తనకు ఇంకా పీరియడ్ మొదలు కాకపోవడం గమనించి సత్యంతో చెప్పింది. ఒక అందమైన భావనను ఈవిధంగా చెప్పడం అతనికి నచ్చలేదు.

"ఈ పీరియడ్స్... ఇట్లాంటి మాటలు చెప్పకు. విషయాన్ని కన్‌ఫమ్ చేసుకున్నాకే చెప్పు. ఎందుకంటే నాకు బోలెడంత పని వుంటుంది" అన్నాడు.

"పనేంటి!?" ఆశ్చర్యంగా అడిగింది రమ్య.

"ఏమండీ, మీరు తండ్రి కాబోతున్నారని నువ్వు చెప్పగానే నిన్నెత్తుకుని గిరగిరా తిప్పాలి..."

"సినిమా స్టైలా? ఈ రూమ్‌లో గిరగిరా తిప్పితే గోడలు తగుల్తాయి. కాలు విరగడమో, తల పగలడమో గ్యారంటీ" అంది.

"అశుభం మాటలెందుకులే. డాక్టర్ వద్దకు వెళ్ళి టెస్టు చేయించుకుందాం. అదీ రెండుమూడు రోజుల తరువాతనే సుమా! ఎందుకంటే, కొన్నిసార్లు పీరియడ్స్ ఇర్రెగ్యులర్ కావడం ఆడవాళ్ళకు సహజమే!" అన్నాడు.

"అబ్బో, ఆడవాళ్ళ విషయాల గురించి బాగా తెలుసునే!" అంది.

"డాక్టర్ కృష్ణక్కయ్య, సమరమన్నయ్యల జ్ఞానభిక్ష" అంటూ నవ్వాడు.

"సంబరం చాలుగాని, పిల్లలు ఇప్పుడే వద్దనుకున్నాంగా!" గుర్తుచేసింది.

**రమ్య పరిస్థితి హృదయవిదారకంగా ఉంది. క్రితం నిమిషం వరకు నవ్వుతూ, తుళ్ళుతూ వున్న మనిషి అకస్మాత్తుగా అంతర్ధానమవ్వడంతో ఆమె ప్రపంచం జీవం కోల్పోయింది. ఆకుల్ని రాల్చుకున్న శిశిరంలా ఉంది. అతడు బతికివున్నట్లే చాలా సార్లు భ్రమ కలిగేది. ఆకలిదప్పుల్లేవు. నిద్రలేదు. తన జీవిత సమస్తాన్ని బరువైన చీకటే దోకప్పినట్లు తల్లడిల్లిపోయింది.**

దిగులుగా చూశాడు సత్యం. తానింకా నిరుద్యోగిననే సంగతి గుర్తుకువచ్చింది. పిల్లాపీచు కలగకముందే రమ్య, తాను కలిసి దేశమంతా బలాదూర్‌గా తిరగాలనే కోరిక కళ్ళముందు మెదిలింది. అన్నిటికన్నా ఆమెకు రాబోయే ఎత్తయిన పొట్ట, పిల్లల బట్టలు మారుస్తూ అవస్థ పడడాలు, పాలడబ్బాలు, రోగాలు రొచ్చు ఖర్చులు అన్నీ గుర్తొచ్చి విచారం కలిగింది.

"ఒకవేళ అదే నిజమైతే... ....అబార్షన్ చేయించుకుంటే ..." ఏదో ఆలోచిస్తూ అన్నాడు సత్యం.

గయ్‌మని లేచింది రమ్య. ఆమెకూ కోపం వస్తుందని మొదటిసారి తెలిసిందతనికి. "ఎంత ఈజీగా అన్నావ్... అసలు అబార్షన్ అంటే తెలుసా నీకు?... సూదుల్తో పొడుస్తారు... కత్తులతో చీలుస్తారు... చిన్నమొగ్గని... ఇంకా రూపుదిద్దుకోని పాపని నలిపేయడం... అది తలుచుకుంటేనే..." మాట్లాడలేకపోయింది.

"అరే, ఇప్పుడే అంత గొడవెందుకు. రేపు టెస్టు చేయించుకున్నాక ఆలోచిద్దాం... సారీ, అదే అయితే పాపను మంచిగా ఆహ్వానిద్దాం" అన్నాడు గిల్టీగా ఫీలవుతూ.

మరుసటి రోజు డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. రమ్య స్నానం చేసిన తరువాత కూడా దేవుని గూట్లో దీపం, అగరుబత్తులు వెలగకపోవడంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు. చలికాలాన్ని తరిమికొడుతూ వేసవికాలం వచ్చేసింది. కొత్తదంపతులను ఎండా, చలి అంతగా బాధించవు. ఒకరి సాన్నిధ్యం మరొకరికి ఎయిర్‌కండీషన్‌లాగా వుంటుంది. చలి ముసురుకునేవేళ వెచ్చదనపు కౌగిళ్ళు, వేడిసమయాల్లో ఒకరి ఒడిలో ఒకరు సేదతీరడాలు... దాంపత్యం పాతపడుతున్నప్పుడు కూలర్లు, హీటర్ల అవసరం గుర్తొస్తుంది.

వేసవి సెలవుల ప్రారంభంలో సత్యం తల్లిదండ్రులు తిరుపతి మొక్కును చెల్లించడానికి ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. అప్పటికే టీచర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ పడింది. పరీక్షకోసం తయారుకావాలనే ఉద్దేశంతో ప్రయాణాన్ని వాయిదా వేయాలని సత్యం ఎంతో ప్రయత్నించాడు. కాని అతని తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. వాళ్ళకు అతను ఒక్కగానొక్క బిడ్డ. కొత్త దంపతులేమో కళ్ళు మెరిసేటట్లున్నారు. ఎప్పుడెవరి దిష్టి తగులుతుందో చెప్పలేం. అదీకాకుండా మొక్కుని చెల్లించడం ఆలస్యం చేస్తే తిరుపతి వెంకన్నకు కోపం రావచ్చు. ఏమన్నా జరిగితే తట్టుకోవడం అసాధ్యం. సత్యాన్ని బలవంతంగా ఒప్పించారు. సుశీలమ్మ, రాజిరెడ్డిలను కూడా రమ్మన్నారు. కాని వేసంగి పంట సమయం కావడంతో వారికి తీరిక దొరకలేదు.

***

తిరుగు ప్రయాణంలో వాళ్ళు ప్రయాణిస్తున్న బస్సు యాక్సిడెంట్‌కు గురయింది. సత్యం తల్లిదండ్రులకు, రమ్యకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఆమె షాక్‌తో స్పృహ కోల్పోయింది. తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరిన సత్యం, మృత్యువుతో రెండుగంటలపాటు పోరాడి ఓడిపోయాడు. వద్దన్నా వినకుండా ప్రయాణానికి బయలుదేరతీసినందుకు ఇంత పెద్ద మూల్యం చెల్లించుకోవలసిరావడాన్ని సత్యం తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. చేజేతులార కన్నబిడ్డను యమునికి అప్పజెప్పామని గుండెలవిసేలా ఏడ్చారు.

రమ్య పరిస్థితి హృదయవిదారకంగా

కథ

ఉంది. క్రితం నిమిషం వరకు నవ్వుతూ, తుళ్ళుతూ వున్న మనిషి అకస్మాత్తుగా అంతర్ధానమవ్వడంతో ఆమె ప్రపంచం జీవం కోల్పోయింది. ఆకుల్ని రాల్చుకున్న శిశిరంలా ఉంది. అతడు బతికివున్నట్లే చాలా సార్లు భ్రమ కలిగేది. భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కుంటాడని, తన చెవి తమ్మెల్ని ఎప్పటిలాగే పెదవుల మధ్య బిగించి నాలుకతో స్పృశిస్తాడని అనిపించేది. కాని ఇంట్లోవాళ్ళ ఏడుపులు ఆమెను వాస్తవంలోకి నెట్టేసేవి. ఆకలి దప్పుల్లేవు. నిద్రలేదు. తన జీవిత సమస్తాన్ని బరువైన చీకటేదో కప్పినట్లు ఊపిరాడనట్లు ఉక్కిరిబిక్కిరయ్యేది. రాగిణి గనక కనిపెట్టి ఉండనట్లయితే ఆమె ఉన్మాదిగానో మారేది. ఆత్మహత్య ఐనా చేసుకునేది.

ఇంత సంక్షోభం మధ్య సుశీలమ్మను ఒక అనుమానం పట్టిపీడించేది. ఆమె భావుకతకు అంతగా తావివ్వని, వాస్తవికతలో జీవించే పల్లెటూరి స్త్రీ. కూతురి భవిష్యత్ జీవితం గురించిన ఆలోచనలు కలవరపెట్టేవి. మనసు చంపుకోలేక ఒకరోజు గుసగుసలాడింది, "నీకు నెలనెలా సరిగ్గా అవుతోందా?" అని. దుఃఖంలో ఉన్న రమ్య ఆ ప్రశ్నను అంతగా పట్టించుకోలేదు. ఒకరకమైన ట్రాన్స్‌లో ఉందామె.

కాలానికి అనుభూతులుండవు. సుఖ, దుఃఖాలుండవు. గడియారాలకు శరీరమే తప్ప హృదయముండదు. సత్యం మరణించి నెలదాటింది. 'మాసికం'లాంటి కార్యక్రమాలు యధావిధిగా జరుగుతున్నాయి. కూతురు ఇంకా 'బయట ఉండకపోవడం' సుశీలమ్మను ఆందోళనకు గురిచేసింది. అన్నం సహించకపోవడం, వికారంగా ఉండడం ఆమె అనుమానాల్ని బలపడేటట్లు చేస్తున్నాయి. రకరకాలుగా లెక్కలు వేసింది. అనుమానం ధ్రువపడినట్లే అనిపించింది. అయినా తొందరపడదలుచుకోలేదు. ఇంకొక వారం రోజులు ఎదురుచూడాలని నిర్ణయించుకొంది. కూతురితో అప్పుడే విషయాన్ని ప్రస్తావిస్తే బాధలో ఉన్న మనిషిని ఇంకా హింసించినట్లవుతుందని తెలుసు. భర్తతో కలిసి ఆలోచించింది. ఈ సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అది రమ్య జీవితాన్ని శాశ్వతంగా నాశనం చేస్తుందని బాధపడ్డారు. ఏం చేయాలో నిర్ణయించుకున్నారు.

మరో పదిహేనురోజులు గడిచాయి. ఇంట్లో బంధువులెవరు లేని రాత్రి రమ్య పక్కనే పడుకొంది. ఏడుస్తూ వున్న కూతురిని మెల్లమెల్లగా విషయంలోకి లాగింది. అంతకుముందు నెలలో ఏ తారీఖున ఆమె 'ముట్టుడయిందో' అడిగింది. రమ్యకు గతమంతా సత్యం జ్ఞాపకాలే. భోరున ఏడ్చింది. పూర్తిగా ఏడవనిచ్చి మళ్ళీ అదే ప్రశ్న అడిగింది. రమ్యకు తటాలున స్ఫురించింది. తల్లి తనను పదేపదే ఆ వివరం ఎందుకడుగుతున్నదో! ఇప్పుడొచ్చిన గ్యాప్ అసాధారణంగా ఉన్న విషయం

కాలానికి అనుభూతులుండవు. సుఖ,దుఃఖాలుండవు. గడియారాలకు శరీరమే తప్ప హృదయముండదు. సత్యం మరణించి నెలదాటింది. 'మాసికం'లాంటి కార్యక్రమాలు యధావిధిగా జరుగుతున్నాయి. కూతురు ఇంకా 'బయట ఉండకపోవడం' సుశీలమ్మను ఆందోళనకు గురిచేసింది. అన్నం సహించకపోవడం, వికారంగా ఉండడం ఆమె అనుమానాల్ని బలపడేటట్లు చేస్తున్నాయి.

కూడా గమనించింది. అదే విషయం చెప్పింది. సుశీలమ్మ గుండెల్లో రాయిపడింది. ఈ సంగతి ఎవరితో చెప్పవద్దని, చివరకు రాగిణికి కూడా తెలియనీయవద్దని ఒట్టేయించుకుంది.

తమ కూతురి గతకాలపు దురదృష్టపు గుర్తును ఏవిధంగా తొలగించాలో రమ్య తల్లిదండ్రులకు అర్థం కాలేదు. దానిలో చాలా కష్టముంది. ముందు కూతురు ఒప్పుకోవాలి. మూడోకంటికి తెలియకూడదు. తెలిస్తే ఒక్కగానొక్క కొడుకు వారసత్వాన్ని నిలుపుకునేందుకు సత్యం తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకువస్తారు. లోకానికి తమ పని క్రూరంగా కనిపిస్తుంది కూడా! తమ పని సానుకూలమయ్యే అవకాశం నర్సారెడ్డి రూపంలో దొరికింది... నర్సారెడ్డి సుశీలమ్మకు సొంత అన్నయ్య! నిజామాబాద్‌లో వుంటాడు. చెల్లెలు కుటుంబాన్ని 'నిద్ర'కు తీసుకుపోవడానికి వచ్చాడు. ఎవరైనా, మరణిస్తే, మరణించిన సంవత్సరంలోపు ఆ కుటుంబసభ్యుల్ని వారి బంధువులు తమ ఇంటికి తీసికెళతారు. వారు అక్కడ కనీసం ఒకరోజు గడపాల్సివుంటుంది. మృతుల సంబంధీకుల్ని విషాదవాతావరణం నుండి దూరంగా తీసుకెళ్ళి, వారిని తేరుకునేటట్లు చేయడానికి ఈ ఆచారం ఉపయోగపడుతుంది.

నిజామాబాద్ నుండి తిరుగు ప్రయాణంలో ఆర్మూర్ వద్ద ఆగాలని నిర్ణయించుకున్నారు. ఆ వూర్లో రాజిరెడ్డికి ప్రాణస్నేహితుడైన డాక్టర్ ఒకరు ఉన్నారు. అతని వద్ద రహస్యంగా 'అబార్షన్' కార్యక్రమం పూర్తిచేయాలనేది రాజిరెడ్డి, సుశీలమ్మల ఉద్దేశం.

... అదే సంగతిని కూతురికి చెప్పింది.

భర్త చావుకన్నా ఘోరమైనవార్త వింటున్నట్లనిపించింది. ఒకరిని విధి బలితీసుకుంది. మరొకరిని తాను బలిచెయ్యాలా? తల్లి ఆలోచన కటువుగా తోచింది. జీవిత సర్వస్వమైన సత్యం తీపి గుర్తుల్ని తుడిచివేయాలనుకోవడం న్యాయమేనా? భర్త లేకున్నా అతని నీడ ప్రపంచంలో మిగిలి ఉండడం కన్నా ఏం కావాలి జీవితానికి? తన ఆనందపు శేషాన్ని సైతం మింగే విషపునాగులా తోచింది తల్లి. ఒక్కసారి దుఃఖం, ఆవేశం ఆమెను అతలాకుతలం చేసాయి.

"అసలు నువ్వు నా తల్లివేనా? కడుపులో పెరుగుతున్న బిడ్డను చంపుదామనడానికి నీకు నోరెలా వచ్చింది? కనీసం ఆడదాని మనసు కూడా లేదు నీకు..." అంటూ హిస్టీరియా పేషెంటులా అరిచింది.

గత కొద్దిరోజులుగా ధర్మాధర్మ విచక్షణ కింద, కన్నకూతురిపై ప్రేమ, రాగిణిలాగా తన కూతురి జీవితం దుర్భరం కారాదన్న ఆరాటాల మధ్య నలుగుతున్న సుశీలమ్మ మనసు ఆ మాటలతో గట్టుతెగిన చెరువయింది. కూతురు భుజం మీద తల ఆన్చి పెద్దపెట్టున ఏడ్చింది.

వెక్కిళ్ళ మధ్య అంది.

"నేను మనిషిని కాదు. రాయిని, రప్పను. మంచి తెలియదు. చెడు తెలియదు. నా బిడ్డ మంచి గుండాలి. అదొక్కటే తెలుసు నాకు. ఈ స్థితిలో నువ్వు పిల్ల తల్లివయితే నీ జీవితం.ఇంకెప్పుడు కుదురుగా ఉండదే! నీ నొసట బొట్టు మెరవదే. నా బిడ్డ ఏ సుఖమూ, సంతోషమూ లేకుండా జీవితాంతం నా నట్టింట్లో ఏడుస్తూవుంటే ఎట్టా తట్టుకునేది? నువ్వు మళ్ళీ పచ్చగుం డాలే! అందుకే ఈ ఆలోచన చేసినానమ్మ. నీ జీవితమూ రాగిణిలాగా కాకూడదమ్మా..." అంటూ ఏడ్చింది.

రాగిణి ప్రస్తావన వచ్చేసరికి రమ్య ఆపాదమస్తకం వణికిపోయింది. ఆమె ఎడారి జీవితమూ, ఏకాకితనమూ గుర్తొచ్చి గొంతెండిపోయింది. రేపు తనకూ రాగిణికిలాగే ఒక పిచ్చిపిల్ల పుట్టదని ఏమిటి నమ్మకం? రాగిణికున్నంత గుండెదిటవు తనకు వుందా? ఉన్నా... చిగురించడం మరిచిపోయిన ఎండిన కట్టెలాంటి బతుకును తలకెత్తుకోవాలా? జీవితపర్యంతం ఒంటరిగా రక్తమాంసాల శరీరాన్ని ఎముకల గూడుగా మార్చుకుంటూ, ముళ్ళకిరీటం ధరించి శిలువ మోస్తూ బతకాలా? లేక జీవితంలో కొత్త వసంతం కోసం ఒక సున్నిత భావనను కళ్ళు మూసుకుని ఛిద్రం చేయాలా?

అనేకానేకమైన ఆలోచనలతో రమ్యకు తల వేడెక్కింది. ఆ రాత్రి తీవ్రమైన జ్వరం వచ్చింది. కలవరింతలు... అస్పష్టమైన ఆకారాలు... కలలతో... తల బరువెక్కింది.

ఒక బుట్టలో పిల్లవాడినేసుకుని చెరువు దిక్కు వెళుతుంటే రాగిణి చప్పట్లు కొట్టి నవ్వుతోంది. తీరా చూస్తే చెరువులో సత్యం ఈతకొడుతూ కనిపించాడు. పిల్లాడిని తీసుకుని ఈత నేర్పించడం మొదలు పెట్టాడు. అంతలో చెరువు సముద్రమయింది. పెద్దపెద్ద బరువైన అలలు తన వైపునకు దూసుకువస్తున్నాయి. చుట్టూ ఏదో నల్లగా అలుముకొంది. దిగ్గున లేచింది రమ్య. కరెంటుపోయినట్లుంది. చుట్టూ చీకటి. అకస్మాత్తుగా బెడ్‌లైట్ వెలిగింది. కొన్ని మంచినీళ్ళు తాగి స్థిమిత పడింది.

ఆలోచనలు మాత్రం వదల్లేదు. ఒక నిర్ణయానికి వచ్చింది. తెల్లారాక తల్లితో చెప్పింది. "అమ్మా, నిజామాబాద్ వెళదాం... వచ్చేప్పుడు ఆర్మూర్‌లో డాక్టర్ అంకుల్‌వద్ద ఆగుదాం..." గొంతు జీరబోయింది.

జీవితమంటే వ్యాపారమా? కావచ్చు.

జీవితపు విలువలు అన్నీ ఆదర్శంతో, భావుకతతో ఉండవు. కొన్నిసార్లు వ్యాపారాత్మకంగా ఉంటాయి. లాభనష్టాలు బేరీజు వేసుకోవడం తప్పనిసరవుతుంది. ●

## పాటల తోటలో పోటా'పోటీ'లు...



"పోటీ అనేది మనిషి జీవితంలో ఓ భాగం. కాంపిటీషన్ అనేది లేకపోతే మజా ఏముంటుంది" అంటాడు ఉదిత్‌నారాయణ్. సినీ సంగీత ప్రపంచంలో పోటీవాతావరణం తీవ్రంగా నెల కొన్నప్పటికీ తన పరిస్థితి మాత్రం బ్రహ్మాండంగా ఉందంటున్న ఉదిత్ కొత్త సంవత్సరాన్ని సూపర్‌హిట్ సినిమాకు పాటలు పాడటం ద్వారా ప్రారంభించాడు. ఆ చిత్రం 'కహో నా ప్యార్ హై'. హృతిక్ తండ్రి రాకేష్‌రోషన్, బాబాయ్ రాజేష్ రోషన్ (చిత్రసంగీతదర్శకుడు) తనకు చాలా కాలం నుంచి తెలుసని, ఆ నేపథ్యంలోనే హృతిక్ ఎదుగుదలను తను గమనించానంటాడు ఉదిత్. అమాయకంగా, నిరాడంబరంగా ఉండే హృతిక్‌లోని ఈలక్షణాలు సినిమాలోనూ, మరీ ముఖ్యంగా పాటల్లోనూ ప్రతిఫలించేలా జాగ్రత్తలు తీసుకుని మరీ పాడాను నేను అంటున్న ఈ బిజీబిజీ గాయకుడు రహమాన్‌తో పాటలు చేస్తే మాత్రం అర్ధరాత్రి దాటిన తర్వాతే పాడాల్సివస్తుంది అంటాడు. తన పాటలకు రాత్రిళ్ళు మాత్రమే సంగీతాన్ని సమకూర్చడం రహమాన్ అలవాటు. ప్రపంచమంతా నిద్రలో ఒదిగిపోయిన ప్రశాంతవేళ తన రాగాల సృష్టికి శ్రీకారం చుట్టే రహమాన్ అంటే ఉదిత్‌కు ఎంతో అభిమానం. అలాగే పాటలను నేపథ్యం, కారెక్టర్లను బట్టి పాడగలిగితే గొప్పగా ఉంటాయన్నది ఉదిత్ అభిమతం. క్రమశిక్షణతో మెలగడం, సిగరెట్లు, మందు జోలికి పోకపోవడం తనకున్న మంచి లక్షణాలు అంటున్న ఉదిత్ గాయకుడిగా ఇప్పటికే సినీ సంగీత ప్రపంచంలో తనదైన 'ముద్ర'ను వేశాడు.